నవల

# భోగమందిరం

పి. ఎస్. నారాయణ



# భోగమందిరం

పి. ఎస్. నారాయణ

## నవల

# భోగమందిరం

## (నవల)

**ఆంధ్రప్రభ**

సచిత్ర వారపత్రిక నిర్వహించిన
నవలల పోటీలో బహుమతి పొంది
17.02.1988 నుండి 15.06.1988 వరకు
ధారావాహికంగా ప్రచురింపబడింది.

**వెల:రు.150**

గమనిక

ఈ నవలలోని పాత్రలు, సంఘటనలు–
అన్నీ కల్పితాలు, ఎవర్నీ ఉద్దేశించినవి కావు.
ఎక్కడయినా పోలికలు, సామ్యాలూ
కనిపించినా అవి యాదృచ్ఛికమే.

–రచయిత

# భోగమందిరం

శనివారం.

రాత్రి పది గంటలు.

పాలకొల్లు రైల్వే స్టేషన్‌కు తూర్పుగా ఊరి చివర్లో అప్పుడే వెలుస్తూన్న కొత్త ఇళ్ళకు మధ్యగా సంవత్సరం క్రితం పూర్తయిన రెండంతస్తుల మేడలో పై హాల్లో మందు పార్టీ జరుగుతోంది.

ఆ ఇల్లు సుబ్బారావుది.

సుబ్బారావుకు పాలకొల్లులో ఓ ఫాన్సీషాపుంది. నర్సాపూర్ రోడ్డులో పాలకొల్లుకు రెండు కిలోమీటర్ల దూరంలో బత్తాయకాయిల తోట ఉంది. అది బత్తాయకాయిల తోటని పేరే కాని ఎక్కువగా కాసేది నిమ్మకాయలు. అవిగాక ఆ తోటకు చుట్టూ ఓ ఏభై కొబ్బరి చెట్లున్నాయి. వాటి మధ్య రెండు దబ్బకాయల చెట్లున్నాయి. ఓ పంపరపనస చెట్టు వున్నది. ఏతావాతా అతనికి ఆ తోట మీద సంవత్సరానికి ఓ పదివేల ఆదాయముంది.

ఆ ఊరు కాలేజీ ఓల్డు స్టూడెంట్స్ ఎసోసియేషన్‌కు, దాన్ని స్థాపించినప్పటి నుంచీ అతడే ప్రెసిడెంటు. ప్రతి సంవత్సరం ఆ కాలేజీలోనూ, అందుకు అనుబంధంగావున్న హైస్కూల్లోనూ చదివిన పాతవిద్యార్థులకు ఓ సమావేశం ఏర్పాటు చేస్తాడు. వచ్చిన అందరికీ డిన్నర్ ఎరేంజ్ చేస్తాడు. ఆపైన అతి ముఖ్యులయిన ఓ

పదిమంది మిత్రులకు మందు పార్టీ ఉండనే ఉంటుంది.

పాత బ్యాచ్‌లవాళ్ళు ప్రతిసంవత్సరం ఓ పాతికమందిదాకా వస్తారు. అందులో చాలామంది ఆ ఊరివాళ్ళే. కాకపోతే గడిచిపోయిన సంవత్సరపు విద్యార్థులే ఎక్కువగా ఉంటారు. కో- ఎడ్యుకేషన్ కాలేజీ అవ్వటంతో ఆడా మగా అంతా జేరతారు.

ఆ రోజు సుబ్బారావు హడావుడి చెప్పటానికే వీల్లేదు. అంతేకాదు- వచ్చిన స్నేహితులంతా ఓ పండగలా గడిపేస్తారు. పాలకొల్లులో ప్రతి సంవత్సరం వాడుకగా వచ్చే వేడుక అది.

గుంటూరునుంచి వినయమూర్తి వచ్చాడు.

అతడు ఆ కార్యక్రమానికి రావటం ఆ కాలేజీ వదిలినప్పటి నుంచి ఓ విధిగా పెట్టుకున్నాడు. చదువుకున్న నాటి మిత్రులనందరినీ అప్పుడు గాక ఎప్పుడు చూస్తాము- అనేది అతని ఉద్దేశం. అందుకే ఎన్ని పనులున్నా ఆ రోజు సాయింత్రానికన్నా అతడు అక్కడకు చేరతాడు.

వినయమూర్తికి గుంటూరులో ఓ పొగాకు కంపెనీ ఉంది. అతని చేతి కింద పాతికమంది మనుషులున్నారు. సీజను వచ్చిందంటే నాలుగయిదు వందలమందికి అతని కంపెనీలో పని కల్పిస్తాడు. గుంటూరులో అతడికి రెండంతస్తుల మేడలు రెండు ఉన్నాయి. ఆరు నెలల క్రితం కొన్న ఎర్ర మారుతి సుజూకి ఉంది. అతనికి వాళ్ళ నాన్న పోతూపోతూ ఇచ్చిన పాతిక లక్షల అస్తి ఉంది. అంత కాకపోయినా లక్షల్లో ఆస్తి తెచ్చిన అందమైన పెళ్ళాముంది.

ఆ ఎసోసియేషన్ అన్ని సంవత్సరాలుగా ఆ గెట్ టుగెదర్స్ నిర్వహించగలుగుతున్నదీ అంటే వినయమూర్తి లాంటి శాశ్వత సభ్యుల ధన సహాయమే ముఖ్యకారణం.

హైదరాబాద్ నుంచి నాగేశ్వరరావు, మద్రాసునుంచి పరబ్రహ్మం ఈ సంవత్సరం దూర ప్రదేశాలనుంచి వచ్చిన వాళ్ళు. విజయవాడనుంచి ఇద్దరు, ముగ్గురు వచ్చారు.

ఎక్కువగా వచ్చింది భీమవరం నుంచి, నర్సాపురం నుంచి. ఆకువీడునుంచి ఓ పదిమంది వచ్చారు.

వినయమూర్తి సుబ్బారావు కనబడగానే వేసిన మొదటిప్రశ్న. "ఈ సంవత్సరమైనా హరిబాబు వచ్చాడా?" అని.

సుబ్బారావు పెదవి విరిచాడు. "వాడెక్కడున్నాడో తెలిస్తేకదా!" అన్నాడు. "ఈసారి నీ సలహా కొంత లాభించింది... పేపర్లలో మన ఆహ్వానాన్ని ప్రకటించటంవల్ల మనకు ముఖాముఖీ తెలియని వాళ్ళు కూడా ఓ పదిమంది దాకా వస్తామంటూ ముందుగా ఉత్తరాలు రాసి మరీ వచ్చారు!"

''భారతిగాని వచ్చిందా?'' ఆశగా అడిగాడు. అతను పేపర్లలో ప్రకటనచేయమంటూ సలహా ఇచ్చింది భారతిని ఏమైనా చూడగలుగుతాడేమో అని– ఆ పైన హరిబాబు లాంటి ఒకరిద్దరు కాలేజీ వదిలింతరువాత ఇంతవరకూ కనబడని ఆప్తమిత్రులు వస్తారేమో అని.

సుబ్బారావు నవ్వాడు. "లేదు."

వినయమూర్తి బి.కాం. చివరి సంవత్సరంలో ఉండగా– భారతి ఇంటర్ సెకండ్ ఇయర్‌లో– వాళ్ళ నాన్నకు ఆ ఊరు బదిలీ కావడంతో వచ్చి జేరింది. సైన్సు సబ్జక్టు. ఆమె ఆ కాలేజీ బ్యూటీగా పేరొందింది.

ఆమె కాలేజీ ఆవరణలో కాలు పెడుతుంటే ఓ మెరుపు మెరిసినట్లుండేది. కళ్ళు మిరిమిట్లు గొల్పుతూ నేల మీద నడుస్తున్నదా లేక ప్రతి కనురెప్ప మూతకూ మాయమవుతూ, ప్రత్యక్షమవుతూ– కుర్రవాళ్ళనందరినీ తెలియని మైకంలో పడేస్తూ– ఓ విద్యుల్లతలా ప్రవేశిస్తున్నదా అనిపించేది.

ఆమెను చూడటానికి ఓ వయస్సు కుర్రవాళ్ళే ఆత్రపడేవారని లేదు. ముసలి అధ్యాపకుల దగ్గరనుంచి, కొత్తగా చేరిన చిన్న కుర్రవాళ్ళవరకూ– సర్వం మరిచిపోయి ఆమెనే చూస్తుండేవారు.

ఆమెది ఎవ్వరితోనూ పోల్చలేని అందం.

"వెంకట్రావు వచ్చాడా?"

"వస్తాననయితే ముందు రాశాడు. రాలేకపోతున్నాను, సారీ- అంటూ నిన్న సాయంత్రం టెలిగ్రాం ఇచ్చాడు. నా అనుమానం వాడు ఆర్థికంగా బాగా దెబ్బతిని గొంతువరకూ ఇబ్బందుల్లో ఇరుక్కొని ఉన్నాడు అని."

"ఏమైంది?"

"మొన్న తుఫాను వల్ల చాలా నష్టమొచ్చిందని అనుకుంటున్నాను. ఆపైన ఆ కుటుంబంలో వాడే కాస్త అమాయకుడు. అన్నలు వీడిని ముంచేసి, చదువుకు వీడికే డబ్బు ఖర్చు ఎక్కువయిందంటూ అప్పులన్నీ వీడి పేర్న వేసి, ఆస్తులన్నీ వాళ్ళు కొట్టేసినట్లున్నారు... ఏమి గొడవలో కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తున్నది గురూ అన్నాడు- ఆరు నెలల క్రితం గుడివాడలో కనబడి."

"అరె పాపం!"

"ఈసారి ఇంకో గమ్మత్తు చెప్పేదా... రంగనాయకులు... మనకు జూనియర్... ఫుట్‌బాల్ ప్లేయరు లేడూ... ఆరడుగులు... అమితాబచన్‌లా ఉంటాడే..."

"ఆఁ... ఆఁ..."

"మొన్న సాయంత్రం వచ్చాడు... గుడివాడ పక్క మోటూరులో వ్యవసాయం చేస్తున్నాడట. ఓ పదిమంది కుర్రాళ్ళను వెంటేసుకొచ్చాడు- గురూగారూ... మన కాలేజీ టీమ్‌కి, మా ఊరి టీమ్‌కి ఫుట్‌బాల్ మాచ్ పెట్టాల్సిందే- అంటూ."

"మీ టీమ్‌లో మన పాత విద్యార్థుల్ని ఒకరిద్దరిని కలుపుకో అన్నాను. ఓ.కే. గురూగారూ అన్నాడు. కాలేజీ టీమ్ కెప్టెన్‌ను పిలిపించి మాట్లాడాను. ఇవాళ పొద్దున్నే ఆడారు. చాలా థ్రిల్లింగ్‌గా ఉందిరా. రంగనాయకులు చాలా గొప్పగా ఆడాడు. ఆ కుర్రాళ్ళతో రాష్ట్రమంతా తిరిగేస్తున్నాడట. ఈ సారి ప్రత్యేక ఆకర్షణ అదే అనుకో. ఆట చూడటానికి ఊళ్ళోనుంచి రెండు వేలమంది దాకా వచ్చి ఉంటారు. ఈ దెబ్బతో

మన ఎసోసియేషన్ గురించి తెలియని వాళ్ళు అంటూ లేకుండా పోయారు."

"గూడ్."

వినయమూర్తి మనస్సంతా అతడి మాటల మీద కంటే– రాని భారతి మీద, హరిబాబు మీద, వెంకట్రావు మీదే ఉంది.

భారతితో అతనికి అసలు పరిచయమే లేదు. అప్పటి తన ఆరాధన– ఆమెను మరోసారి చూస్తే బాగుండు ననిపిస్తోంది ఇప్పుడు.

హరిబాబు, వెంకట్రావులు తన క్లాస్‌మేట్స్, బెంచిమేట్స్.

వెంకట్రావంటే పొరుగూరినుంచి రావాలి. హరిబాబుది ఈ ఊరే అయినా అతను ప్రస్తుతం ఎక్కడున్నదీ, ఏం చేస్తున్నదీ– ఎవ్వరికీ తెలియకపోవటం ఎంతో విచారకరం. వాడు వందమంది మనుషుల పెట్టు. గలగలలాడుతూ ఎదురుగ్గా ఎంతమంది ఉన్నా గుక్కతిప్పుకోనిచ్చేవాడు కాదు. నవ్వుల వెల్లువే!

వాడి అడ్రసు కూడా దొరక్కపోవటం పిటీ!

ఆ సాయంత్రం కాలేజీ ఆవరణలో– ఆ ఊరి కుర్రాళ్ళే కొంతమంది ఓ సాంఘిక నాటకం వేశారు. ఓ పాత విద్యార్థిని పదేళ్ళ కూతురు వచ్చీ రాని డాన్సు చేసింది... ఏవో ఫాన్సీ డ్రస్సులు... పాటలు...

వీటన్నిటికీ మించి తెలియని అనుభూతినిచ్చింది– ఒకరినొకరు కలుసుకోవటం, యోగక్షేమాలు విచారించుకోవటం!

ఉత్సవ కార్యక్రమాలన్నీ పూర్తవగానే ఆ ఆవరణలోనే ఏర్పాటు చేసిన డిన్నరుకు అంతా హాజరయ్యారు. అది అయ్యేటప్పటికి రాత్రి తొమ్మిది గంటలయింది.

ఆపైన సుబ్బారావు, ముఖ్యులైన స్నేహితులు అతగాడి ఇంట్లో మందు పార్టీకి హాజరయ్యారు.

"ఈరోజు మందు పార్టీకి ఓ ప్రత్యేకత ఉంది. అది రామసుబ్బుగాడి

కవితాగానం...”

“నీ కవిత్వం కిక్కిచ్చేటట్లుంటేనే చదువు... లేదంటావా... మందుతోనే కిక్కెక్కించుకో!” నాగేశ్వరరావు అరిచాడు.

సీసాల మూతలు ఊడి కింద పడుతున్నాయి. టీపాయ్ మీద ఉన్న గాజు గ్లాసులు నిండుతున్నాయి. అందులో అయిసు ముక్కలు కరుగుతున్నాయి.

“నేను బీరు తప్ప మరొకటి తీసుకోనని తెలుసుకదా!” వినయమూర్తి అన్నాడు నవ్వుతూ.

“మా ఖర్మ కాకపోతే నువ్వు పెళ్ళెందుకు చేసుకున్నావు, గురూ?”

“అదేమిటయ్యా పెద్దమనిషీ! ఎవ్వరైనా పెళ్ళాం దగ్గర పర్మిషన్ తీసుకునేటప్పుడు తాగేటందుకు తీసుకుంటారు కానీ– బీరేందుకు తీసుకోరు కదా!”

నవ్వులు– టీపాయ్‌మీద గ్లాసుల కదలికలతో.

వేరే బీరు సీసా మూత తీసి వినయమూర్తి ముందు పెట్టాడు సుబ్బారావు.

“దీనికీ కోటా ఉందా, పండూ?”

“ఒకే ఒక్క సీసా!”

“అవును– రాముడికి ఒకే ఒక్క భార్యలా!” జగన్నాథం ముందుకు వంగాడు.

“రామసుబ్బా! మెదలెట్టు...”

“ఆడపిల్లలు అల్లరి చేస్తే

అమాయకుడు

ఆడపిల్లల్ని అల్లరి చేస్తే

అమ్మాయకుడు.”

“చప్పగా ఉంది– ఇంకాస్త మందు లోపలకు పోయిందాకా నోరుమూసుకు

కూర్చో!"

"జీడిపప్పులేవిరా సుబ్బిగా... నీ ఫాన్సీ షాపులో జీడిపప్పులమ్మరా?"

"ప్లాస్టిక్ బొమ్మలమ్ముతాం... తింటావా?"

"అందాల తార- ఊర్వశి... మేనక... రంభలను తలదన్నే భారతి చదివిన కాలేజీలో చదివిన మనకు ప్లాస్టిక్ బొమ్మలేనా గతి- దేవా!"

వినయమూర్తికి ఆ సమయంలో ఆ నోళ్ళతో భారతిని తలుచుకోవటం నచ్చలేదు.

"ఈ క్షణాన ఎక్కడ ఏ దేవతలతో ఆ దేవత అమృతం సేవిస్తున్నదో కదా!"

'ఛ... ఛ... ఈ వెధవలు మంచివాళ్ళను కూడా ఎంత అసహ్యంగా ఊహిస్తారు!' వినయమూర్తి మనస్సులోని ఆలోచనలకు ప్రతిబింబంగా ముఖంలో చికాకు స్పష్టంగా కనబడింది.

రామసుబ్బు గ్లాసులోది గడగడా తాగేసి నోరు తెరిచాడు. ఖాళీ అయిన గాజు గ్లాసు వంక, టీపాయ్ మీద ఉన్న ఉల్లిపాయ పకోడీల వంకా చూస్తూ.

"తండ్రి తనకో కోడల్ని చూసుకున్నాడు

అతడికి అరవై వేలు కట్నం వస్తే సరి

కొడుకు కోమల్ని తప్ప చేసుకోనన్నాడు

ఆవిడకు అప్పటికే ఆరో నెల మరి!"

"వహవా... వహవా... అద్భుతం... మహాద్భుతం... పెళ్ళి కాకుండానే కడుపు చేసిన భాగ్యశాలీ! నీకివే మా అందరి తరఫునా నా జోహార్లు... రామసుబ్బుకు నా పేరున మరో గ్లాసు!"

వినయమూర్తి ముందుకు ఎవ్వరో సిగరెట్టు పెట్టె తోశారు.

"థాంక్యూ!"

"ఒక్కటి గురూ."

"ఆఖరుకు!"

"హమ్మయ్య... నీ పర్మిషన్‌లో అదికూడా రాయించావు కదా!"

"మరోటి గురూ!" అన్నాడు లావుపాటి సుందర్రావు ముందుకొంగి. "అవునూ– ఇందాక పదహారు ఆమ్లెట్లుండాలి .... ఇప్పుడు ఒక్కటీ లేదేం... మనం ఆరుగురమే కదా ఇక్కడున్నది?"

"అత్తగారికి తెల్లవార్లూ నిద్ర ఉండదు పాపం

మా పెళ్ళిలోనే మొదలయిందట ఆ రోగం

పెద్ద డాక్టర్ల దగ్గరకే వెళ్దామని ఇచ్చాను అభయం

తన కొడుకును ఎక్కడ వల్లో వేసుకుంటానో అని ఆమె భయం"

"అత్తలంతా అంతే గురువా... ఇంతకీ నువు అమ్మాయి అనుకొని రాశావా దాన్ని?"

రామసుబ్బు సిగ్గు పడుతున్నట్లుగా నవ్వి అన్నాడు. "మా ఆవిడ పేరున కొన్ని, నా పేరున కొన్ని రాసేస్తుంటాను గురూ. అవున్రా... నాగేశ్వర్రావూ! నీకు ప్రెస్సుందిగదా... నాదో గేయసంపుటి కొట్టించేయగూడదూ?... ఏడవబోకు కాగితం ఖర్చిస్తాలే!"

"చూద్దాం, చూద్దాం... ఓ వంద రాసి పంపించు... అందులోనుంచి యాభై ఏరి పుస్తకం వేస్తా. అయినా నీ కవిత్వంలో ప్రబోధం ఏదోయ్ సన్నాసీ?"

"గ్లాసులు ఖాళీ... గ్లాసులు ఖాళీ!"

"ఆమ్లెట్లు ఖాళీ... ఆమ్లెట్లు ఖాళీ!"

"అరేయ్ అప్పల్‌నర్సూ సరుకేదిరా? పట్రా త్వరగా!" సుబ్బారావు కేక పెట్టాడు కుర్రాడి కోసం.

“ఈలోగా రామసుబ్బుగాడు మరో కవితను మన నెత్తిన బాదుతాడు!”

“మనిషికి దండ వేస్తే

మహానుభావుడు,

పటానికి దండ వేస్తే

కీర్తిశేషుడు!”

“అవునవునోయ్... గాంధీగారిలాగా!”

సీసాలు పైకి వచ్చినయ్... మూతలు ఊడిపోయినయ్...

వినయమూర్తి టైం చూసుకున్నాడు. “పదకొండు అయింది” అన్నాడు పక్కనే కూర్చున్న సుబ్బారావుతో.

“ఏరా... నువ్వెళ్ళక తప్పదా?”

“వెళ్ళాలిరా. రేపు మధ్యాహ్నం నా మిసెస్‌ని విశాఖపట్టణం పంపిస్తున్నాను డెలివరీకి!”

“ఫర్ ది హెల్త్ ఆఫ్ వినయమూర్తి అండ్ మిసెస్ వినయమూర్తి! కొట్టండిరా ఛీర్స్... మరోసారి!”

వినయమూర్తి హాయిగా, గర్వంగా నవ్వాడు.

“వీడికి మగపిల్లవాడే పుట్టుగాక!”

“పాలకొల్లులోనే చదువుగాక!”

“తాగటానికి కూడా పర్మిషన్ తీసుకోనక్కరలేని పెళ్ళాన్నే పెళ్ళి చేసుకోగాక!”

“శుభం... శుభం... శుభం!”

“హరిబాబును ఎలాగైనా పట్టుకోవాలిరా. నాకు వాడిని చాలా చాలా చూడాలని వుంది!” వినయమూర్తి సిన్సియర్‌గా అన్నాడు.

“భారతి లాగానే వాడూ కనబడకుండా పోయాడు... గాడిద వెధవ!”

“అరేయ్ మీకు తెలుసో, తెలియదో... హరిబాబుగాడి లీలల్లో ఒకటి చెప్పేదా?”

“చెప్పాలి... ఇప్పుడే చెప్పాలి!”

“ఒక రోజు క్లాసులో హరిబాబు జేబులో భారతి ఫొటోను చూశాను!”

“వాడి జేబులోది నీకెట్టా కనబడిందిరా?” జగన్నాథం నసిగాడు.

“నాకు కళ్ళజోడుందిలేవోయ్ అప్పుడు!”

“చతుర్ నేత్రా... ఇక చెప్పవో మరి!”

“అది ఎలా కొట్టుకొచ్చాడో తెలుసా?”

“ఆ అమ్మాయి ప్రేమించి ఇచ్చిందేమో!”

‘నీ బొందా... నా బొందా... భారతి అణాకానీ ఠికానా లేనివాడిని ప్రేమిస్తుందా? ఎవరైనా నమ్మాలా? ప్రేమిస్తే నాలాంటి వాడిని ప్రేమించాలి... లేకపోతే నోరుమూసుకు ఇంట్లో పడివుండాలి!” అతగాడి తల అప్పటికే దిమ్మెక్కిందని తెలుస్తూనే ఉంది.

“అవునవును... అందుకనేగా ఆ పిల్ల పాలకొల్లు హోల్‌మొత్తంలో ఎవర్నీ ప్రేమించకుండానే వెళ్ళిపోయింది!”

“లెస్స పలికితివిరా భడవా!”

“ఇంతకీ ఫొటో సంగతి చెప్పి ఏడ్వనే లేదు!”

“ముందు ఏడుస్తున్నాడు కదా... తరువాత చెబుతాడులే!”

“పబ్లిక్ ఎగ్జామినేషన్‌కు అప్లికేషన్ ఇవ్వాలి అంటే ఫొటో తీయించుకోవాలిగదా. అది ఏ స్టూడియోలో తీయించు కున్నదీ కాచి కాచి పట్టుకుని, ఫొటో తీయించుకోగానే ఆ ఫొటోగ్రాఫర్ చేతిలో ఓ పది రూపాయల నోటు పెట్టి ఓ కాపీ రహస్యంగా తెచ్చేసుకున్నాడు. అవునూ, నాకు తెలియక అడుగుతాను- ఫొటోను ఏం

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Bhogamandiram**

* * *